ట్రాక్టర్‌ను ఢీకొని ఆగిన థార్ వాహనం

బీభత్సం సృష్టించిన వాహనం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో 'మహీంద్రా థార్' మంగళవారం నాడు బీభత్సం సృష్టించింది. బంధువుల వాహ నం తాళం తీసుకున్న కొందరు యువకులు వాహనం స్టార్ట్ చేసి ముందుకు నడిపారు. తరువాత దానిని నియంత్రించడం వారికి సాధ్యపడలేదు. అతివేగంగా ముందుకు వెళ్తూ దారిలో అడ్డు వచ్చిన ఒక కుక్కను తొక్కించడంతో అక్కడికక్కడే అది చనిపోయింది. మరో చిన్న పిల్లాడిని తగులుతూ పోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. వర్మ హెూటల్ దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాలీ భాగంలో ఢీకొని ఆగి పోయింది. ట్రాక్టర్ రాకుండా ఉంటే వర్మ హెూ టల్ వద్ద వున్న వారిపైకి దూసుకెళ్లి.. ప్రాణ నష్టం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తాలూకా సిఐ విజయకృష్ణ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

మెడికల్ కాలేజీలను

ప్రభుత్వమే నిర్వహించాలి..

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

వైసిపి ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలను ఉపసంహరించి ప్రభుత్వమే నిర్వహించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటికరణకు వ్యతిరేకంగా వైస్సార్సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా మంగళవారంనాడు వైసీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు వద్ద సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైయస్ఆర్ సిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు నగరికంటి శ్రీనివాసరావు సారథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబుతో కలసి మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న పది మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రారంభం కాలేదనే పేరుతో వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రక్రియ అత్యంత దుర్మార్గం అని దునుమాడారు. మార్కాపురంలో పనులే ప్రారంభించలేదని వక్రీకరించడం తగదని హితవు పలికారు. పీపీపీ పద్ధతిన మెడికల్ కాలేజీలు ఏర్పడితే ఫ్రీ మెడికల్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో గాయం సావిత్రి రెడ్డి, ఎండి యాసిన్, డి ఏడుకొండలు, నూకతోటి రవికుమార్, లీగల్ సెల్ అధ్యక్షులు ధర్నాశి హరి బాబు, ఒంగోలు నగర లీగల్ అధ్యక్షులు కాకుటూరి సంపత్ కుమార్, రాష్ట్ర లీగల్ సభ్యులు సానికొమ్మి రామిరెడ్డి, కె.స్వామి రెడ్డి పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న బూచేపల్లి, అన్నా

టిడిపిలో చేరిన ఎంపీపీ దంతులూరి

ప్రజాశక్తి-కనిగిరి

పీసీపల్లి మండలం, గుంటూరు లింగన్న పాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాగా.. ఆయన సమక్షంలో కనిగిరి ఎంపీపీ దంతులూరి ప్రకాశం వైసీపీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ కండువాను ప్రకాశంకు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు కొండా కష్ణారెడ్డి, టిడిపి నాయకులు బాలు ఓబుల్ రెడ్డి ప్రకాశంకు అభినందనలు తెలిపారు.



ఎంపీపీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

సిఎం రిలీఫ్ ఫండ్‌కి విరాళం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకునేందుకు పిడిసిసి బ్యాంకు ఉద్యోగులు ఒక్కరోజు వేతనం విరాళంగా ప్రకటించారు. పిసిపల్లి మండలం, లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సమక్షంలో రూ.5,24,092 చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అందజేశారు.



సిఎంకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

2026లో 'వెలిగొండ' నీళ్లిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ప్రతీ కుటుంబంలోనూ ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారుచేస్తామన్నారు. భవిష్యత్ అంతా టెక్నాలజీదేనని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ జనవరికి అమరావతిలో ప్రారంభం అవుతుందన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లను మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి చేసి పంపించేలా పరిస్థితి మారుతుందన్నారు. గత పాలనలో పరిశ్రమలు మూతపడ్డాయని.. పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారని ముఖ్యమంత్రి అన్నారు. చెత్త నుంచి సంపద సష్టించడమే ఇప్పుడు కొత్త విధానమన్నారు. కొత్తగా ఏర్పాటు అవుతున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు దీనిని అందిపుచ్చుకోవటం సంతోషదాయకమన్నారు. దీనిద్వారా రాష్ట్రంలోని రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కేంద్రం ఏ పాలసీ తీసుకొచ్చినా దాన్ని మొదట అమలు చేస్తోంది ఏపీనేన్నారు. ప్రధాని మోదీ ఏది మొదలు పెట్టినా ఏపీలో తక్షణం అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సగటు తలసరి ఆదాయం గణనీయంగా పెంచేలా పనిచేస్తున్నాం. రామాయపట్నం పోర్టుకు దగ్గరే బీపీసీఎల్ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీని ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వరయశ్వంత్, తహశీల్దార్ ఉషా, ఎంపీడీవో జీవీ కష్ణారావు, టిడిపి మండల అధ్యక్షులు వేమూరి రామయ్య, డిసిఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, పి ఏ సి ఎస్ ఛైర్మన్ పరిమి ఈశ్వరయ్య, కనిగిరి మార్కెట్‌యార్డు ఛైర్మన్ యారవ రమాశ్రీనివాసులు, పువ్వాడి నాగరాజు, కసిరెడ్డి హనుమారెడ్డి, కరణం తిరుపతిరావు, వడ్డెంపూడి వెంకట్రావు, తెలుగు యువత నాయకులు నాగేంద్రబాబు, కోటపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు



సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ గోపాలకృష్ణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, దామచర్ల జనార్ధన్, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, టిడిపి దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ఐదు హామీలు అమలు చేశాం..

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-పిసిపల్లి

ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 హామీలలో ఐదింటిని అమలు చేశామని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లింగన్నపాలెం సమీపంలో ఎంఎస్ఎంఇ పార్క్‌ను ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడారు. రూ.173 కోట్లతో కనిగిరిలోని పదివేల కుటుంబాలకు తాగునీరు అందించేందుకు కషి చేస్తున్నామన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు రిలయన్స్ బయో గ్యాస్ ప్రాజెక్టును ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను జీవించినంత కాలం ప్రజా సేవకుడుగానే ఉండాలని తన కోరికని డాక్టర్ ఉగ్ర తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే లైను పనులు కోసం రూ. 24 కోట్లు మంజూరు చేయించి.. పనులు ప్రారంభించామన్నారు. త్వరలోనే కనిగిరికి రైలు వస్తుందన్నారు. కనిగిరిలో త్వరలో ట్రిపుల్ ఐటి కళాశాల ఏర్పాటు కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య పిఏసిఎస్ ఛైర్మన్ కరణం ఈశ్వరయ్య, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కరణం తిరుపతిరావు, ఉప్పగండ్ల శివరామయ్య, కోటపాటి రామారావు, కసిరెడ్డి హనుమారెడ్డి, తెలుగు యూత్ నాయకులు ఏనుగంటి నాగేంద్రబాబు, వీరపనేని పెద్దన్న, సర్పంచులు పల్లా మల్లికార్జున, కరణం తిరుపతయ్య, సాంసన్, జనసేన పార్టీ నాయకులు మాదాసు రమేష్ బాబు పాల్గొన్నారు.

సిఎం సభను విజయవంతం చేసిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మూడు రోజుల్లోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభను విజయవంతం చేసి తన సమర్ధతను నిరూపించుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని మరియు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అన్ని శాఖల అధికారులను ఏర్పాటు పనుల్లో భాగస్వాములలను చేసి పనులు చేయించారు. సభను విజయవంతం చేసేందుకు కషి చేసిన అధికారులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

రైతుల వద్దే పొగాకు నిల్వలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

నల్లబర్లీ పొగాకు మండెలు ఇంకా పొలాల్లోనే ఉన్నాయి. ఇంకొల్లు అంబేద్కర్ నగర్ పక్కనున్న ముప్పరాజు వారి కొష్టాల వద్ద ఇంకా పొలంలోనే పొగాకు నిల్వలు దర్శనం ఇస్తున్నాయి. పొలాలతోపాటు పలు గ్రామాల్లో గృహాల వద్ద ఆరుబైట పొగాకు ఇంకా దర్శనమిస్తుంది. నల్లబర్లీ పొగాకు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ రైతులు ఆశించిన స్థాయిలో కొనుగోలు చేయలేదు. కొనుగోళ్లు ప్రారంభం నుండి నిల్వ గిడ్డంగులు లేవన్న సాకుతో కాలయాపన చేస్తూ వచ్చారు. దీనికి తోడు ఒక్కో రైతుకు 20 క్వింటాలకు మించి కొనుగోలుకు అనుమతి ఇవ్వలేదు. కొంతమందికి ఇప్పటివరకు కొనుగోలు పేర్లు రాని ఉన్నారని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అసలు పొగాకు కొనుగోలు ప్రభుత్వం నిలిపివేసింది. ఇటీవల గుంటూరు సమీపంలో పత్తిపాడు ప్రాంతంలోని పుల్లరిగుంట, పొన్నూరు, నందిపాడు, సిహెచ్‌పేట తదితర సుదూర ప్రాంతాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేశారు. అయినా కొంతమందికి అమ్ముకోటానికి అవకాశాలు ఇచ్చారు. కొంత మంది రైతులు పొగాకు బాడుగ పెట్టుకుని చెక్కులు కట్టి అంత దూరం పోయినప్పటికీ పొగాకు నాణ్యత లేదన్న సాకుతో తిరస్కరించడంతో నిరాశతో వెళ్లలేదు. దానికి తోడు తిరస్కరించిన చెక్కులు మళ్లీ వెనకకు తెచ్చి క్వింటా చెక్కు రూ.1200 నుండి రూ.1500కు ప్రైవేటు కమిషన్ దారులకు అమ్ముకున్నారు. ఇంకా రైతుల వద్ద పొగాకు నిల్వలు అలానే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందడుగు వేసి మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు.

గ్రామాల్లో ప్రైవేట్ కమిషన్ వ్యాపారులు

ఇదిలా ఉంటే ఇటీవల కురిసిన తుఫానుతో ప్రకాశం జిల్లా లోవేసిన వర్జీనియా పొగాకు నాట్లు దెబ్బతిన్నాయి. దీనికి తోడు పొగాకు పంట వేసే రాష్ట్రాల్లో కర్ణాటకలోని మైసూర్ తదితర ప్రాంతాల్లోని పొగాకు కూడా వర్షాలకు దెబ్బతిన్న సమాచారం ఉంది. ఏదేమైన మళ్లీ గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలు కొనుగోలు చేయటానికి ప్రైవేటు కమిషన్ దారులు అక్కడక్కడ వచ్చి రైతులను కలుస్తున్నారు. పొగాకు బాగుంటే ఇక్కడే క్వింటా రూ.6వేలకు కొంటామని చెబుతున్నారని రైతులు తెలిపారు. దీనికి తోడు బ్యార్నీ పొగాకు ధర ప్రస్తుతం బాగా ఉంది. దీనికి తోడు బాపట్ల, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో నల్లబర్లీ పొగాకు క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో వచ్చే ఏడాది పొగాకు ఇప్పటికే సాగు చేసిన ప్రాంతాల్లో దెబ్బతినడంతో తక్కువగా దిగుబడి రానుంది. ఇది దృష్టిలో ఉంచుకొని మళ్లీ రైతుల వద్ద ఉన్న నల్ల బర్లీ పొగాకు నిల్వలు తక్కువ ధరలకే ముందుగా కొనుగోలు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మళ్లీ పొగాకు కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ధరలు కూడా ప్రకటించిన ప్రకారం రూ.12వేలు, రూ.9వేలు, రూ.6వేలకు కొనుగోలు చేయాలి. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన రైతులకు డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిన అవసరం ఉంది.


ముప్పరాజు కొష్టాల వద్ద పొలంలో ఉన్న పొగాకు నిల్వలు


మాట్లాడుతున్న అద్దంకి ఏడిఎ బి ఎప్రాయం

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - అద్దంకి

విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏడిఎ బి ఎప్రాయం తెలిపారు. మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి నిర్వహించారు. డిఎపి ఎరువులు అధికంగా వాడటం వలన భూమి నుండి సహజంగా అందే సూక్ష్మ పోషకాలు అందకుండా పోతున్నాయని తెలిపారు. ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ భాస్వరం ఎరువులు దుక్కిలోనే వేసుకోవాలని తెలిపారు. రైతులు రెండో దఫా, 3వ దఫా కూడా భాస్వరం ఎరువులు వాడకం వలన ఖర్చులు పెరుగుతున్నాయని అన్నారు. ఈ విధంగా వాడకం వలన సూక్ష్మ పోషకాల లోపాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, ఎఇఒ కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, గ్రామ పెద్దలు పుట్టా సాంబశివరావు, నరిశెట్టి వీరాంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

డిసెంబర్ 13న లోక్‌అదాలత్

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని కోర్టు భవనాల సముదాయం నందు డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ డి నాగ వెంకట లక్ష్మి వెల్లడించారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

కోతుల బెడదతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో గత వారం రోజుల నుండి కోతుల బెడద తీవ్రంగా ఉందని వేంపాడు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన కంకణంపాటి బుచ్చిబాబు, సామంతపూడి మోహనరావుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని కోతులు పట్టుకునే వారి ద్వారా పట్టించి అడవిలో వదిలి వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలపై సూచనలు చేస్తున్న ఎస్ఐ జి సురేష్

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పూసపాడు అడ్డరోడ్డు వద్ద వివిధ రకాల వాహన చోదకులకు ఎస్ఐ జి సురేష్ అవగాహన కల్పించారు. డ్రైవర్లు అందరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు. అతివేగంగా వాహనాలు నడప కుండా తగిన వేగంతోనే నడపాలని అన్నారు. ప్రయాణానికి ముందుగానే వాహనాలు తనిఖీ చేసుకోవాలని తెలిపారు. బ్రేకులు, టైర్లు తదితర భాగాలు తప్పనిసరిగా పరిచూసుకోవాలని అన్నారు. బస్సులు, పెద్ద వాహనాలైతే అగ్నిమాపక నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. లైసెన్సు, అవగాహన లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనానికి అనుమతులు తప్పని సరిగా ఉండాలని సూచించారు. రాత్రి వేళ ప్రయాణం అప్పుడు అలసినట్లు ఉంటే వాహనం ఆపి విశ్రాంతి తీసుకోవాలని అన్నారు. అలానే ఫేస్ వాష్ చేసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు డ్రైవర్లు, వాహన యజమానులు పాటించి సురక్షంగా ఉండటంతో పాటు ప్రయాణికులను సురక్షంగా గమ్యస్థానానికి చేరవేయాలని తెలిపారు.

అబ్దుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడు


బాపట్లలో ఆజాద్ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

భారత తొలి విద్యా శాఖ మంత్రి అబుల్ కలామ్ ఆజాద్ స్ఫూర్తిని నేటి యువతకు స్ఫూర్తని అబుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్ అన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అటువంటి మహనీయుల చరిత్ర తెలుసుకొని భవిష్యత్తు నిర్మాణంకు యువత పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో గణపవరం మాజీ సర్పంచ్ కత్తి దానియేలు, పాపారావు, మద్దాల పాపయ్య, డి రాము, నర్రా సాంబు, గవిని ప్రసాద్, కె కొండలు, తిరపతయ్య, శివ పాల్గొన్నారు.

అద్దంకి : భారత స్వాతంత్ర్య సమర యోధుడు, తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుక స్థానిక పోతురాజు గండిలోని తెలుగుదేశం కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్మరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాది వేసి భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ సేవలు మరువలేనివని అన్నారు. కూటమి ప్రభుత్వం మైనారిటీలకు అండగా నిలుస్తుందని తెలిపారు. జబ్బార్, కరిముల్లా, మహబు, మొహిద్దీన్, మాలిక్, రసూల్, వలి, అహ్మద్, ఖాశిం, సలీం, బాషా, సుభాని పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు కృషిచేసిన తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిరస్మర నీయుడని టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ అబ్దుల్ రజాక్ తెలిపారు. అబుల్ కలాం 138వ జయంతి వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుడు, భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా ఎన్నో సేవలు అందించిన అబుల్ కలాం సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కామినేని జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, కన్నెగంటి శ్రీను, సకల ఆంజనేయులు పాల్గొన్నారు.


అబుల్ కలాంకు నివాళులర్పిస్తున్న మార్టూరు నాయకులు

రాతి మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ క్షేత్రంలో కొలువైన ఆంజనేయ స్వామి దేవస్థానం నందు పాలకవర్గ సభ్యులైన దూళిపాళ్ల వెంకటరత్నం భర్త నాగేశ్వరరావు దేవస్థాన మండపం నిర్మాణానికి రూ.1,001116 విరాళంను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, చుండూరి మురళి సుధాకరరావు సమక్షంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులైన నూతి ప్రసాదు, వెంకటరత్నం కుమార్తెలు శైలజ, అనురాధ, కళ్యాణి పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

13న బాపట్లలో ఐక్యత ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల


దేవిరెడ్డి కిరణ్మయి

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 13న బాపట్లలో ఐక్యత పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా మై భారత్ ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా యూనిటీ ర్యాలీ ఏర్పాటు చేశామని అన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విభజిత భారతదేశాన్ని ఐక్యతా సూత్రంతో 'ఏక్ భారత్ - ఆత్మ నిర్భర్ భారత్' నినాదంతో భారతదేశం ఏకతాటిపై నిలిపేందుకు ప్రధాని ఈ కార్యక్రమం రూపొందించారని అన్నారు. యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ ద్వారా వికసిత భారత పాదయాత్రలు ప్రారంభించిందన్నారు. జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు లిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బాపట్ల

బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 నుండి 20 వరకు స్థానిక గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అంగలకుదురు శివాజీ గణేషన్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, పట్టణ ప్రజలు ఈ వారోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 14న బాలల దినోత్సవం, గ్రంథాలయ వారోత్సవాల వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన, 16న విద్యార్థులకు పరుగు, క్యారమ్స్ పోటీలు, 17న నేటి సమాజంలో డిజిటల్ లైబ్రరీ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీ, 18న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రతో ఉపయోగాలపై డిబేట్, 19న చిత్రలేఖన పోటీలు, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఏడిఎ సుదర్శన్ రాజు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - పంగులూరు

భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వాడాలని, ఆ విధంగా చేయడం వలన ఎరువులపై పెట్టే ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు పైరుపై వచ్చే చీడపీడల ఉధృతి తగ్గించుకోవచ్చని మార్టూరు ఏడిఎ కె సుదర్శన్ రాజు అన్నారు. మండలంలోని కొండ మంజులూరు, కోటపాడు గ్రామాల్లో సోమవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన వరి పొలాలు పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో సాగు చేయటం వలన భూసారం పెరుగుతుందని అన్నారు. వరి నారు నాటేముందు తప్పనిసరిగా చివరి ఆకులు తుంచివేయాలని సూచించారు. దీనివలన మొదటి దశలో పైరుపై ఆశించే పురుగు ఉధృతి తగ్గుతుందని అన్నారు. వరి నారు నాటేటప్పుడు కాలిబాటలు ఉండే విధంగా రైతులు చూసుకోవాలని తెలిపారు. ప్రతి చదరపు మీటరుకు 44 కుదుర్లు ఉండే విధంగా నాటుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఎఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి భూ యజమాని, కౌలు రైతులు పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. దీనివలన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పండించిన పంటని మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు, నాయకులు చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, విఎఎ పవిత్ర, రోజీ పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో జరిగే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర 15వ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు కోరారు. నవంబర్ 15, 16 తేదీల్లో ఒంగోలు నగరంలో జరగనున్న మహాసభల లోగోను మంగళవారం నాడు యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ టీ. మహేష్, జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా నవంబర్ 15న భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి నరసింహం, టీ విజయమ్మ, కే సామ్రాజ్యం, యు కుమారి, కే మోహన్‌రావు, వై రవికుమార్, ఆర్ శ్రీనివాసరావు, బి సుబ్బారావు, కే ఆనంద్, పోకల కోటేశ్వరరావు, అనిత, ఎం సింహాద్రి, భారతి తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని చిమటవారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఎఒ కుమారి మాట్లాడారు. అవి విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి ప్రాముఖ్యత, అధిక రసాయనిక ఎరువుల వాడకం వలన కలిగే అనర్థాల గురించి వివరించి చెప్పారు. కార్యక్రమంలో తనుబొద్దివారి పాలెం సర్పంచ్ అన్నపూర్ణమ్మ, విఎఎ జిలాన్, మాజీ జెడ్‌పిటిసి శివరామిరెడ్డి, శేషిరెడ్డి, దొడ్డా నాగబాబు, వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకట్రావు, బాబు, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు కొత్తపేట గ్రామంలోని వడ్డెసంఘంలో కోటి సంతకాల సేకరణ మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ హుమాయున్ కబీర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టగా ఎస్సీ సెల్ నాయకులు జంగం మహేష్, జోగిరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నవంబర్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఎఒ ఎండి ఫారుక్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని కావూరు, ఆరుంబాక గ్రామాల్లో రైతు క్షేత్రాల సందర్శించారు. 3వ వారం నుండి నడింపల్లి, గూడవల్లి, కనగాల, రాంబట్లపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సాధారణ రకం క్వింటాల్ రూ.2369, గ్రేడ్ ఎ రకం క్వింట రూ.2389 నిర్ణయించినట్లు తెలిపారు. అదే 75 కేజీల బస్తా రూపంలో సాధారణ రకం రూ.1777, గ్రేట్ ఏ రకం రూ.1792 ధర నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ సెంట్రింగ్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక అంకమ్మ కాలనీకి చెందిన గుంజి సూర్యనారాయణ (39) సెంట్రింగ్ చెక్కలు తీస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన ఇడుపులపాడులో మంగళవారం జరిగింది. ఇడుపులపాడులో నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటికి సూర్యనారాయణ సెంట్రింగ్ పెట్టాడు. మంగళవారం ఆ ఇంటి స్లాబుకు వేసిన చెక్కలు ఊడదీసే క్రమంలో సెంట్రింగ్ పని చేసే అతను ప్రమాద వశాత్తు కిందపడి తలకు బలమైన రక్త గాయం అయినట్లు తెలిపారు. ఇడుపులపాడులో ఉన్న రాధాకృష్ణ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా ప్రథమ చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం కోసం ఇంకొల్లు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తుపాను బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున వినతి

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న బాధితులను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక ఆర్డీఒ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసిన ఆయనతో పాటుగా వైసిపి ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లె ఇన్‌చార్జ్ డాక్టర్ ఈఊరి గణేష్ తుఫాను బాధితుల సమస్యలు వివరించి నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తుఫాను బాధితులను ఆదుకోవడంలో విఫలమవుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి బాధితులకు అండగా నిలవాలని



కలెక్టర్ వినోద్ కుమార్‌కు నివేదిక అందజేస్తున్న దృశ్యం

కోరారు. మొంథా తుఫాను కారణంగా నీట మునిగిన పొలాలు, మగ్గాలు, గృహాల వివరాలు నిష్పక్షపాతంగా నమోదు చేసి న్యాయం చేయాలని అన్నారు. చీరాలకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ బృందానికి జిల్లా పరిపాలన సమగ్ర నివేదిక సమర్పించాలని అన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

త్వరలో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పంగులూరులోని మాగుంట సుబ్బరామి రెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల పిడి మేకల సీతారామరెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 8, 9, 10, తేదీల్లో విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన జట్టు ప్రథమ బహుమతి సాధించిన విషయం తెలిసిందే. ఈ జట్టులో ఆడి ప్రథమ స్థానం సాధించడంలో బాజీబాబు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, భరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ



బాజీ బాబు



ప్రవీణ్ కుమార్‌రెడ్డి



భరత్ కుమార్

ముగ్గురు విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే ఖో ఖో పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందని సీతారాంరెడ్డి తెలిపారు. వీరిని ఆర్ఐఓ ఆంజనేయులు, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ చింపారెడ్డి, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య అభినందించారు.

కుంకలమర్రులో భారీ చోరీ

ప్రజాశక్తి - కారంచేడు

దైవ దర్శనార్థం కోసం ద్వారకా తిరుమల వెళ్లిన వారి ఇంట్లో దొంగలు దోచుకెళ్లిన ఘటన మండలంలోని కుంకలమర్రులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. దొంగతనం ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అర్వపల్లి కోటేశ్వరరావు కుటుంబంతో సహా ద్వారకా తిరుమల దైవ దర్శనం కోసం సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి తిరిగి ఇంటికి వచ్చిచూస్తే ఇంటి ప్రధాన ద్వారం తాళం బద్దలు కొట్టి ఉండటంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కారంచేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కారంచేడు పోలీసులు సంఘటన జరిగిన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం గృహంలో గుర్తు తెలియని దొంగలు పడి ఇంటి తాళాలు పగలగొట్టి రూ9.25 లక్షల విలువైన 18.5 సవర్ల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న కారంచేడు పోలీసులు

ఇచ్చారని తెలిపారు. ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న నగలు దొంగతనం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో క్లూరీస్ టీం ఆధారాలు సేకరిస్తున్నారు. ఘటన స్థలానికి ఇంకొల్లు సీఐ వైవి రమణయ్య, ఎస్ఐ ఖాదర్ బాషా క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో దొంగలు ఉపయోగించిన వస్తువులు అధికారులకు దొరికాయి.



కారును ఢీ కొట్టిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు

కారును ఢీకొన్న స్కూల్ బస్సు

ప్రజాశక్తి - చీరాల

జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారును స్కూల్ బస్సు ఢీ కొట్టిన ఘటన మండలంలోని బుర్లవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. చెరుకుపల్లి నుండి చీరాల వైపు వస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు అదే మార్గంలో ముందు వెళ్తున్న కారును వెనుక నుండి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 15 మందికిపైగా విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే విద్యార్థులెవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఫుడ్ కమిషన్ సభ్యులు గంజిమాల దేవి సూచించారు. మండలంలోని వెదుళ్ళపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ ఎస్ విజయమ్మతో కలిసి ఆమె సందర్శించారు. మహిళల ఆరోగ్య సమస్యల పట్ల శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వాసుపత్రిలోనే సహజ ప్రసవం అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకో వాలని అన్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో అర్హత లేని వైద్యులను కట్టడి చేయాలని అన్నారు. ప్రథమ చికిత్స చేసే గ్రామీణ వైద్యులు కూడా అనుమతులు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వై బాలసుబ్రమణ్యం, ఎంపిహెచ్ఈఒలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న తహశీల్దారు గోపికృష్ణ

విఆర్ఒ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని బోయినవారిపాలెంలో రీ సర్వేకు వెళ్లిన విఆర్ఒ పోతురాజు (46) గుండె పోటుతో మృతి చెందిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఆయన అంత్యక్రియలు మంగళవారం పర్చూరు మండలం గర్నెపూడిలో కుటుంబ సభ్యుల నిర్వహించారు. చీరాల తహశీల్దారు గోపికృష్ణ హాజరై విఆర్ఒ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పోతురాజు మృతి బాధాకరమని అన్నారు. తామంత అన్ని వెళలా అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం నుండి రావలసిన అన్ని రకాల సదుపాయాలు తక్షణమే అందేలా చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం విఆర్ఒ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. విఆర్ఒల అసోసియేషన్ ప్రతినిధులు అధికారులు హాజరయ్యారు.



స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

శ్రీనివాసరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - అద్దంకి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ వరూధినితో పారిశుద్ధ్యంపై చర్చించారు. మండలంలోని 26 పంచాయతీల పరిధిలో ఇప్పటికే డంపింగ్ కేంద్రాలు 17 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థల సేకరణకు సంబంధించిన ఐదు పెండింగులో ఉండగా ఇటీవల అవి కూడా అనుమతులు లభించాయని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో డంపింగ్ కేంద్రాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకునే విధంగా నివేదిక అందిస్తామని తెలిపారు.



వ్యాసరచన పోటీ విజేతకు ప్రోత్సాహకం

కంటి చూపుపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

విద్యార్థులు మెరుగైన కంటిచూపు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ కారంపూడి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో అక్షర విద్యా భవన్ పాఠశాల్లో షణ్ముఖ నేత్రాలయ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా పర్యావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. తరచూ సెల్ ఫోన్ చూడటం నియంత్రించుకోవాలని అన్నారు. శిబిరంలో 30 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి కంటి సమస్యలు గుర్తించి తగు సూచనలు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు సెంటిస్ ఫార్మాస్యూటికల్ సంస్థ ప్రతినిధులు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట నారాయణ, జగదీశ్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, హెచ్‌ఎం రత్నమాల, పుష్పలత పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

'మనో బంధు'కు పూర్తి సహకారం

ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మానసిక రుగ్మతలతో బాధపడుతూ వీధుల్లో నిరాశ్రయులుగా సంచరించే వారిని గుర్తించి, వారికి వైద్య సేవలు అందించి, అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించే సేవా కార్యక్రమాన్ని 'మనో బంధు' స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టడం అభినందనీయమని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. అక్టోబర్ 23 నుండి నవంబర్ 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తుల కోసం 'మనో బంధు' సంస్థ నిర్వహించనున్న రెస్క్యూ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధపడే నిరాశ్రయులను గుర్తించి వారికి సహాయం అందించడంలో 'మనో బంధు' సంస్థ చేస్తున్న కృషి ఎంతో ప్రేరణాత్మకమైందన్నారు. రోడ్ల పక్కన, పబ్లిక్ ప్రదేశాల్లో తిరుగుతున్న మానసిక రుగ్మతల బాధితులను గుర్తించి వారికి వీలైనంత త్వరగా సహాయం అందించడానికి పోలీసు అధికారులు, సిబ్బంది కూడా సహకరిస్తారని తెలిపారు.

అక్టోబర్ 23 నుండి నవంబర్ 18 వరకు కొనసాగనున్న ఈ రెస్క్యూ డ్రైవ్‌కు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి మానసిక రోగుల గురించి సమాచారం ఉంటే వెంటనే 'మనో బంధు' సంస్థకు అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి వారిని రక్షించడం, వారికి తగిన వైద్య సేవలు, ఆహారం, వసతి కల్పించడం, చివరికి వారి కుటుంబాలతో తిరిగి కలపడం ఎంతో మానవతా సేవ అని ఎస్పీ చెప్పారు. 'మనో బంధు' సంస్థ సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి చేస్తున్న ఈ ప్రయత్ని అందరూ ప్రోత్సహించాలని, పోలీసు శాఖ తరఫున సహకారం అందిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో 'మనో బంధు' ప్రతినిధులు బాల సురేష్, నారాయణ, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బి.ఎస్. నారాయణ భట్ట్, 'ఫోరం ఫర్ బెటర్ బాపట్ల' కన్వీనర్ డాక్టర్ పి.సి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

గృహప్రవేశాలు వేడుకగా జరపాలి..

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ లేఅవుట్ లలో లబ్ధిదారులు నిర్మించుకున్న పక్కా గృహప్రవేశాలు వేడుకగా జరపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లు ఒకే రోజు గృహప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో వేడుకలు జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. తీర ప్రాంతాలలోని ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక గ్రామానికి 10 మరుగుదొడ్లు మంజూరు చేయించి, నిర్మించేలా అధికారులు చూడాలన్నారు. స్వచ్ఛ భారత్ పై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాకు మంజూరు అయిన 46 సామాజిక మరుగుదొడ్లు వేగంగా నిర్మించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో సామాజిక మరుగుదొడ్ల అవసరతను గుర్తించి తక్షణమే నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద మంజూరైన పనులను అధికారులు రెండు వారాలలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పథకం కింద ఎంపికైన 56 గ్రామాలలో 40 శాతానికి పైగా ఎస్సీ జనాభా ఉన్నట్లు చెప్పారు. ఆయా గ్రామాలు అభివృద్ధి జరగాలంటే గ్రామస్థాయి అభివృద్ధి ప్రణాళిక విధిగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రూ.2.80 కోట్ల నిధులు మంజూరు కాగా, ఆ పనులలో పురోగతి లేక పోవడం ఏమిటని ప్రశ్నించారు. నలుగురికి మంచి చేయాలనే సదుద్దేశంతో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. ఎంపీడీవోలు సెలవు పెట్టాలంటే తప్పనిసరిగా కలెక్టర్ అనుమతి పొందాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడి వెంకటేశ్వరరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని రాజ దిబోరా, డి ఎల్ డి ఓ పద్మ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మార్పు సహజం

- మార్పే ముందుకు నడిపిస్తుంది..
- మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమాజ మార్పు ప్రకృతిలో జరిగే పరిమిత పరిణామమే గాక మానవ చర్యల ఆధారంగా నిరంతరం చలనాన్ని కలిగి ఉంటుందని శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం పట్టణంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 'మారుతున్న సమాజం' అనే అంశంపై జరిగిన స్టడీ సర్కిల్లో లక్ష్మణరావు మాట్లాడారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జై.వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన స్టడీ సర్కిల్లో ఆయన మాట్లాడారు. ఏ అంశంలోనైనా మార్పు సహజమన్నారు. మారటం ప్రకతి నైజమని, ఆ మార్పే సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. ఆదిమానవుడి నుండి ఆధునిక మానవుడి వరకు అనేక విషయాలను నేర్చుకుంటూ అవతరించాడని వివరించారు. శ్రమ, నైపుణ్యం మానవుడి అభివృద్ధికి తోడ్పడ్డాయని వివరించారు. అక్టోబర్ విప్లవం ఎనిమిది గంటల పని సాధించిందని దున్నే వాడికే భూమి ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు సోషలిస్టు దేశాలుగా మారడానికి ఉత్తేజాన్నిచ్చిందన్నారు. ప్రపంచంలో జరిగే అనేక పోరాటాలు, ఆందోళనలకు అక్టోబర్ విప్లవ స్ఫూర్తి అని చెప్పారు. వ్యవస్థలో దోపిడీ ఉన్నంతకాలం దానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతాయని, తద్వారా సమాజం ముందుకే పోతుందని వివరించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు కొండయ్య, సిఐటియు నాయకులు శరత్, ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిణి, వై భాస్కరరావు, కోట వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాలదేవి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పిల్లలు, గర్భిణులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాలదేవి తెలిపారు. బాపట్ల, వేటపాలెం చిన్నగంజాం మండలాలలో ఆమె మంగళవారం విస్తతంగా పర్యటించారు. పాడిసన్ పేట విలేజ్, బాపట్ల మండలం చౌక ధర దుకాణం, కొండుబోట్లపాలెం గ్రామం లోనూ చౌక ధర దుకాణం, భరత్‌నగర్ కాలనీ, కొండ బొట్లపాలెంలోని అంగన్వాడీ కేంద్రం పరిశీలించారు. లబ్ధిదారులకు సరుకులు ఏమీ ఇవ్వకపోవడాన్ని గుర్తించి.. కార్యకర్తకు మెమో



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న గంజిమాలదేవి

ఇవ్వాలన్నారు. కొమ్మరెత్తి వెంకయ్య అండ్ కోటమ్మ మెమోరియల్ జడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో ఆహారం నాణ్యత లేకపోవడంతోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్ఎంకి షోకాస్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. ఏజీ కాలేజ్ రోడ్డులోని సరస్వతి స్మారక గవర్నమెంట్ గర్ల్స్ యూపీ స్కూల్ లో 548 విద్యార్థినులకు గానూ 259 మంది విద్యార్థినులు మాత్రమే స్కూల్లో మధ్యాహ్నం భోజనం తీసుకుంటున్నారు. హెచ్ఎంకి షోకాస్ నోటీస్ ఇవ్వాలన్నారు. వేటపాలెం మండలంలోని ఎం జె ఏ బి సి డబ్ల్యు ఆర్ బాలుర పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం పరిశీలించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ రాధా మాధవి, తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు

వ్యాపారవేత్తలు ముందుకు రావాలి..

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో వ్యాపార రంగానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం చీరాల నియోజకవర్గం, వేటపాలెం మండలం నాయినిపల్లి గ్రామంలో ఎం.ఎస్.ఎం.ఇ చేనేత టెక్స్ టైల్స్ పార్కుకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, చీరాల శాసనసభ్యులు ఎం.మాల కొండయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాలలో 80 ఏ.ఎస్.ఎం.ఇ పరిశ్రమలను స్థాపించడానికి ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తున్నారని చెప్పారు. జిల్లాలో నిజాంపట్నం, అమతలూరు మండలం గోవాడ, వేటపాలెం మండలం నాయినిపల్లి మూడు ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించడానికి ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఆక్వా రంగం, పర్యాటక రంగం ఎంతో వేగవంతంగా అభివద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. వేటపాలెం మండలం నాయిని పల్లి గ్రామంలో 23 ఎకరాల విస్తీర్ణంలో చేనేతటెక్స్ టైల్స్ శంకుస్థాపన చేయడం జరిగిందని, టెండర్లు కూడా పిలవడం జరిగిందని, త్వరలో పనులు ప్రారంభించడానికి తీసుకుంటామని చెప్పారు. సమాజం అభివద్ధి చెందాలంటే పిల్లలను ఆడ, మగ అనే తేడాలు లేకుండా అందరిని సమానంగా చదివించాలన్నారు. చదువుకుంటే వినూత్నంగా ఆలోచించి అభివద్ధి చెందుతారని చెప్పారు. జిల్లాలో త్వరలో జాబ్ మేళా నిర్వహించి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు.

చీరాల శాసనసభ్యులు ఎం మాల కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో చేనేత కార్మికులను ఆదుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు చేనేత టెక్స్ టైల్స్ పార్కును మంజూరు చేశారన్నారు. చీరాలలో తయారైన కుప్పడం వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని ఆయన అన్నారు. వేటపాలెం మండలం నాయినిపల్లి గ్రామంలో 23 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.5 కోట్లతో చేనేత టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. చీరాల నియోజకవర్గంలో చేనేత టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల 3 వేల మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. చీరాల నియోజకవర్గంలో టెక్స్ టైల్స్ పార్కును ఏర్పాటు వల్ల ఈ ప్రాంతంలో ప్రజలకు ఉద్యోగ అవకాశాలు ఇక్కడే లభిస్తాయని ఆయన చెప్పారు. చేనేత టెక్స్ టైల్స్ పార్కు నిర్మాణం వల్ల ఈ ప్రాంతం అంతా కూడా అభివద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. చీరాలలో ఆటోనగర్ 400 మందికి ఏ.పి.ఐ.ఐ.సీ. ద్వారా ప్లాట్లు కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాయిని పల్లి రాజీవ్ నగర్ స్వగహ కాలనీలో 530 మందికి గహాలు మంజూరు చేశామన్నారు. చేనేతపురి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్మశాన భూమికి అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. చీరాల ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే వైద్య సహాయం అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. చీరాలకు క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ 23.75 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ సజ్జా హేమలత, సంయుక్త కలెక్టర్ భావన, ఏ.పీ.ఐ.ఐ.సీ జోనల్ మేనేజర్ నరసింహారావు, చేనేత జౌళి శాఖ ఏ.డి రఘు నందన్, చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, వేటపాలెం ఎంపీడీఓ రాజేష్,తహసిల్దార్ గీతా, చీరాల మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు, చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కవర్తపు జనార్ధన్, నాసిక వీరభద్రరావు, బుచ్చేశ్వరరావు, గుత్తి రామాంజ నేయులు తదితరులు పాల్గొన్నారు.